క్లుప్తంగా

సప్తాహ మహోత్సవాలు



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి సప్తాహ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి పంచార్టిక దీక్ష, కృతకల్యాణ మహోత్సవాలు, అష్టకలశ స్థాపన మహోత్సవం జరిగింది. అర్చకులు స్వామివారికి వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరం గ్రామ కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొడాలి శ్రీనివాస్, అరుణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఉంగుటూరు : ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల సమస్యలు, మండలంలో జరిగే అభివృద్ధిపై సమీక్షిస్తామని, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం : గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి పీహెచ్‌డీ, లేదా నెట్ లేదా స్లెట్ అర్హత కలిగిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు ఫిబ్రవరి 6వతేదీ లోగా దరఖాస్తులను కళాశాలలో అందచేయాలన్నారు. 10వతేదీన అభ్యర్థులకు ముఖాముఖీలు నిర్వహించి ఎంపికైన వారికి పోస్టింగ్ ఇస్తామన్నారు.

వసంతకుమార్ మృతి తీరని లోటు

భీమడోలు : మాజీ మంత్రి వసంతకుమార్ మృతి తీరని లోటని భీమడోలు మాజీ జెడ్పీటీసీ ఈదా వెంకటరత్నం అన్నారు. వసంతకుమార్ తండ్రి వట్టి వెంకట రంగ పార్థసారధి, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ వసంతకుమార్ హయాంలో తాను భీమడోలు జెడ్పీటీసీగా చేశానని చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడుగా వసంతకుమార్ ఈ ప్రాంతంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలెన్నింటినో పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారన్నారు. బీసీ చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ తదితరులు వసంతకుమార్ మృతికి సంతాపం తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెదవేగి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2020–22 సంవత్సరాల్లో పెదవేగి మండల పరిధిలో చేపట్టి పూర్తి చేసిన ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ ఉంటుందని ఏపీఓ హేమలత తెలిపారు. గత కొద్ది రోజులుగా గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభలపై ఫిబ్రవరి 1వ తేదీన జిల్లా స్థాయి ఆడిట్ అధికారులు, అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఇతర అధికారులు ఈ తనిఖీలో పాల్గొంటారని ఏపీఓ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ప్రజావేదికలో పూర్తి నివేదిక వేలువడుతుందని ఆమె తెలిపారు.

వర్సిటీ హ్యాండ్‌బాల్ జట్టుకు శిక్షణ పూర్తి



శిక్షణ పూర్తి చేసుకున్న నన్నయ్య వర్సిటీ జట్టు

దెందులూరు: మండలంలోని వేగవరం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్ విశ్వవిద్యాలయాల సౌత్ జోన్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనే నన్నయ వర్సిటీ హ్యాండ్‌బాల్ జట్టు శిక్షణ పూర్తి చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ, కోచింగ్ ఆర్గనైజర్, పరిశీలకుడు టీఎస్ కరుణానిధి చెప్పారు. సేలంలోని పెరియా యూనివర్సిటీలో ఫిబ్రవరి 4 నుంచి 8వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ హెచ్‌ఓడీలు, జేఎన్‌టీయూ అధికారులు యూనివర్సిటీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

మార్చి 23 నుంచి వర్జీనియా కొనుగోళ్లు

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు మార్చి 23న ప్రారంభిస్తున్నట్లు కేంద్రం వేలం నిర్వహణ అధికారి గ్రేసీ మార్కెట్ మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు బోర్డు ఆక్షన్ మేనేజర్ డి.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కొయ్యలగూడెంతో సహా ఎస్ఎల్ఎస్ పరిధిలోని జంగారెడ్డిగూడెం1, 2, దేవరపల్లి, గోపాలపురంలోని పొగాకు వేలం కేంద్రాలలో అదేరోజు కొనుగోళ్లు ప్రారంభం అవుతాయన్నారు.

నవరత్నాలతో ఇంటింటా వెలుగులు

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- బువ్వనపల్లిలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



కొండలరావునాయుడు నివాసంలో ఎమ్మెల్యే వాసుబాబు, ఆయన సోదరులకు హారతులు పడుతున్న మహిళలు

ఉంగుటూరు : నవరత్న పథకాల అమలుతో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ ప్రతి ఇంటా వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం బువ్వనపల్లి గ్రామ సచివాలయం -1 పరిధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలో చేపట్టి మంగళవారంతో 127వ రోజుకు చేరుకుంది. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబాన్ని పలకరించి ఆయా కుటుంబాలకు గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ పరంగా అందిన నగదు లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. పథకాల అమలు తీరుపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ తిరిగి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకూ పార్టీ శ్రేణుల నడుమ గడప గడపకు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అడుగు అడుగునా పూలమాలలతో, హారతులతో ఎమ్మెల్యే వాసుబాబుకు నీరాజనాలు లభించాయి. మండల కాపునాడు అధ్యక్షుడు సంకు కొండలరావు నివాసంలో పెద్ద ఎత్తున మహిళలు ఎమ్మెల్యేను, వారి సోదరులను పూలమాలలు, హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు పుప్పాల చినబాబు, కన్నబాబు, కార్తీక్, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, వైస్ సర్పంచ్ వెల్లంకి నరేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను తదితరులున్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దెందులూరు: మండలంలో గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి కోరారు. మండలంలో పోతునూరు గ్రామంలో ఓసీ–1, జోగన్నపాలెంలో ఎస్సీ–2, దెందులూరులో బీసీ–ఈ–1, ఎస్సీ, ఓసీ–2, ఎస్సీ, ఎస్సీ ఉమెన్, ఎస్టీ–3 గోపన్నపాలెం బీసీ–డీ రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నియామకం జరుగుతుందన్నారు. మొత్తం 10 వలంటీర్ల పోస్టులకు నియామక ప్రక్రియ జరుగుతుందని 18 సంవత్సరాలు కలిగి ఉండి 35 సంవత్సరాలు మించనివారు ఈ పోస్టుకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 6వ తేదిన స్క్రూట్నీ జరుగుతుందని, 7వ తేదిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎన్నికైన వలంటీర్లకు 9వ తేదిన నియామక పత్రాలు అందించడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

గృహసారథుల బాధ్యతలు కీలకం



గృహసారథులు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ప్రజలు మన్ననలు పొందుతున్న వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే పేదలందరికీ మేలు జరుగుతుందని, దీంట్లో గృహసారథుల బాధ్యతలు కీలకమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం సీతంపేటలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆశయాలకు అనుగుణంగా పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, జగనన్న సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, కోటిపల్లి సత్తిరాజు, ఉదయభాస్కర్, గణేష్, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

భీమడోలు రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు



భీమడోలులో ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

భీమడోలు : జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్‌కు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు అత్యవసర పనులు చేపడుతున్నారు. దీంతో రైల్వే గేటు మూసివేశారు. ట్రాక్‌పై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ఆ ట్రాక్ మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది ఎదురవుతున్న పరిస్థితి. ఈ సమస్యను రైల్వే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై సంబంధిత రైల్వే అధికారులు రెండోరోజు మంగళవారం ట్రాక్ మరమ్మతులు చేపట్టారు. ఈ ట్రాక్‌పై ప్రయాణించే భారీ వాహనాలు, ఇతర వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. పాతూరు, వడ్లపట్ల మీదుగా వివిధ ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు, భారీ వాహనాలు గమ్యాలకు చేరుకుంటున్నాయి. శుక్రవారం ఈ పనులు పూర్తవుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

భీమడోలు ఏడీఏ రాజకుమారి సేవలు అభినందనీయం



భీమడోలులో ఏడీఏ పి.ఉషారాజకుమారిని సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న ఏవోలు, సిబ్బంది

భీమడోలు: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ భీమడోలు ఏడీఏ డా. పి.ఉషారాజకుమారి ఉత్తమ వ్యవసాయాధికారిగా జిల్లా కలెక్టర్ ఎం.ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో భీమడోలు ఏడీఏ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆమెను భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, గ్రామ సహాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భీమడోలు ఏడీ ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఈ తరుణంలో వ్యవసాయ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వ హించడం రైతులకు ఉత్తమ సేవలందిస్తున్న ఏడీఏ పి.ఉషారాజకుమారి సేవలు మరవలేనివన్నారు. అనంతరం ఏడీఏ పి.ఉషారాజకుమారిని దుశ్శాలువాతో పాటు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు, ద్వారకాతిరుమల, నిడమర్రు ఏవోలు బాలిన వెంకటేష్, దుర్గారమేష్, బన్నీ, హబ్ ఏవో రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మొయ్యేరులో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

గణపవరం: ప్రతి మనిషి ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా భారతదేశానికి పూర్వ వైభవం తీసుకురావచ్చునని హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు అన్నారు. ఆదిత్య, యోగి వేమన పద్యాలు, త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం చేయాలని సూచించారు. గణపవరం మండలం మొయ్యేరు గ్రామంలో మంగళవారం ప్రబోధ సేవాసమితి, త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని అనుబంధ గ్రంథాలు చదివి స్వామివారి ప్రసంగాలు విని ఆత్మజ్ఞానం తెలుసుకుని ప్రజలంతా జ్ఞానులుగా మారాలని వారు ప్రచారం చేశారు. వేమన పద్యాల జ్ఞానం భగవద్గీత జ్ఞానం రెండు ఒకటేనన్నారు. వేమన తత్వ, కృష్ణ తత్వం కూడా ఒకటేనన్నారు. కార్యక్రమంలో ఉదయకుమార్, నాగేశ్వరరావు, రమేష్, హనుమంతరావు, వాసుదేవ, రామకృష్ణ, సత్యనారాయణ, తారకేశ్వరి, సాయిశ్రీ, యశోద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హమాలీ చార్జీల సొమ్ముల పంపిణీ

భీమడోలు : భీమడోలు రైతు సేవా సహకార సొసైటీ పరిధిలో 2021–22 వ్యవసాయ రబీ సీజన్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు హమాలీ చార్జీలను అందిస్తున్నట్లు భీమడోలు సొసైటీ చైర్మన్ రావిపాటి సత్యశ్రీనివాస్ మంగళవారం తెలిపారు. సొసైటీ పరిధిలోని రబీ సీజన్‌లో సుమారు 1400 మంది రైతులు ధాన్యం విక్రయించారన్నారు. ఒకొక్క క్వింటాలుకు రూ.10 చొప్పున రైతులకు రూ.20 లక్షలను వారికి చెక్కుల రూపంలో అందజేస్తున్నామని చైర్మన్ సత్యశ్రీనివాస్ తెలిపారు. బుధవారం నుంచి రైతులకు తమ బ్యాంకు వద్ద చెక్కులు అందజేస్తామని చెప్పారు.

నీటి సరఫరాపై హర్షం



సాగు, తాగునీటిని నింపుతున్న కలపర్రు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు

పెదపాడు: మండలంలోని కలపర్రు గ్రామంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సహకారంతో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు కలపర్రు వైఎస్సార్‌సీపీ నాయకుడు వట్రపు కోటిరెడ్డి తెలిపారు. మంచినీటి చెరువుకు, పంట పొలాలకు నీటి సరఫరా చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెదపాడు మండలంలోని కలపర్రు గ్రామంలో ఇటీవల రాజగోపాల స్వామి పంపింగ్ స్కీమ్ కింద 300 ఎకరాలకు సాగునీరు అందడం లేదని ఇటీవల కలపర్రు గ్రామ పర్యటనకు విచ్చేసిన సమయంలో రైతులు సాగునీరు అందడం లేదని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువచ్చారు. చెరువుకు నీరు నింపడం కష్టతరంగా మారిందని తెలిపారు. దీంతో అబ్బయ్యచౌదరి మోటార్లు ద్వారా నీటిని నింపేందుకు చర్యలు చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే పనుల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతుపై దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

పెదవేగి : కౌలు రైతుపై దౌర్జన్యం చేసి పంటను నాశనం చేసిన వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన వేగుంట దుర్గామల్లేశ్వరచౌదరి పెదవేగి మండలం జగన్నాథపురంలో చిలకపూడి సాంబశివరావుకు చెందిన 17.59 ఎకరాలకు కౌలుకు తీసుకుని మొక్కజొన్న, జామతోట సాగు చేస్తున్నారు. జనవరి 12న జగన్నాథపురం గ్రామానికి చెందిన వేగుంగ రవికుమార్, పాలడుగు భానుప్రకాష్, బలుసు వెంకట రాంబాబులు, వేగుంట దుర్గామల్లేశ్వరచౌదరిపై దౌర్జన్యం చేసి మొక్కజొన్న పంటను నాశనం చేశారు. దీంతో బాధితుడు పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన



కూచింపూడి ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : పెదవేగి మండలం కూచింపూడి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పెదవేగి ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో అందిస్తున్నారో మెనూ ప్రకారం అందిస్తున్నారో లేదోనని పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు





ప్రత్యేకాలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి, అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వివిధరకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు జిల్లాల నుంచి విచ్చేసిన భక్తులు క్యూలో నిలబడి అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి



రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న బొల్లిన నిర్మల కిషోర్

భీమడోలు : ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలుపుదల చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు, రైల్వే పీఏసీ సభ్యురాలు బొల్లిన నిర్మల కిషోర్ సోమవారం ఢిల్లీలో రైల్వే బోర్డు సమావేశంలో బోర్డు చైర్మన్ కృష్ణదాస్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల భీమడోలు పర్యటనకు వచ్చేసిన నిర్మల కిషోర్‌కు భీమడోలు బీజేపీ మండల శాఖ భీమడోలులో రైళ్లు నిలుపుదల చేయాలని, బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో నిర్మల కిషోర్ బోర్డు చైర్మన్ కృష్ణదాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల కోసం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, ఇది ఇక్కడ ప్రజలు, భక్తుల చిరకాల వాంఛ అని ఆయనకు ఆమె వివరించారు. దీనిపై స్పందించిన కృష్ణదాస్ విజయవాడలోని రైల్వే డీఆర్ఎంకు ఫోన్ చేసి భీమడోలులో రైళ్ల నిలుపుదల చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు నిర్మల కిషోర్ చెప్పినట్లు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ విలేకరులకు తెలిపారు. మరికొన్ని రోజుల్లో భీమడోలులో రైళ్ల నిలుపుదల, రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌లను ఏర్పాటు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భీమడోలులో హోటల్‌పై విజిలెన్స్ దాడులు

- అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్ల స్వాధీనం
- యజమానిపై కేసుల నమోదు



భీమడోలులో గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

భీమడోలు : భీమడోలు జంక్షన్‌లోని బృందావన హోటల్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. హోటల్ యజమానిపై రెండు కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై జి.కె.నాగరాజు, ఏజీ శ్రీధర్‌బాబు రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేశారు. హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆరు గ్యాస్ సిలిండర్లలో ఐదు హెచ్‌పీ, ఒకటి భారత్ గ్యాస్ సిలిండర్లు కాగా వాటి విలువ రూ.16,458 ఉంటుందని పేర్కొన్నారు. యజమాని సలాది వీరవెంకట సత్యనారాయణపై 6ఏ, 7 1) కేసులను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సిలిండర్లను స్వాధీనం చేసుకుని వాటిని సంబంధిత సీఎస్ డీటీకి అప్పగించారు. ఈ దాడుల్లో ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వోలు వెజ్జు వినయ్, జి.మార్కేండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన వివరాలు

గణపవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయ భవనం పైఅంతస్తు నిర్మాణ సముదాయానికి బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభోత్సవం చేస్తారని, సాయంత్రం నాలుగు గంటలకు కైకరం శివారు వెంకటకృష్ణాపురంలో గడపగడపకు మనప్రభుత్వం 128వ రోజు కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి సుభాష్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఆన్‌లైన్ పనులు చేయించొద్దు

ఏలూరు (టూటౌన్): ఆశ వర్కర్లతో వారికి సంబంధం లేని ఆన్‌లైన్ పనులు చేయించవద్దని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆశ వర్కర్ల సమస్యలును పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగరాజు, ప్రసాద్ కోరారు.

కుష్టు నివారణ అందరి బాధ్యత



కాశిపాడులో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది తదితరులు



వట్లూరు పీహెచ్‌సీ పరిధిలో కుష్టు నివారణ ర్యాలీని నిర్వహిస్తున్న వట్లూరు పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం : కుష్టు రహిత సమాజ స్థాపన అందరి బాధ్యత అని, కుష్టు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య సిబ్బంది మంగళవారం కాశిపాడులో అవగాహన కల్పించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కుష్టువ్యాధిపై ఫిబ్రవరి 13వ తేదీ వరకూ గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ పర్సన్ నామాలరాజు చెప్పారు. ఈసందర్భంగా హైస్కూల్ విద్యార్థులచే కుష్టు నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఎవరికైనా శరీరంపై రాగిరంగు మచ్చలు, స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులు, వైద్యం పూర్తిగా ఉచితమన్నారు. ప్రాథమిక దశలో చికిత్స చేస్తే కుష్టువ్యాధి నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.కాంతిశ్రీ, పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు కుష్టు నివారణలో భాగస్వాములు కావాలి

పెదపాడు: కుష్టు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వట్లూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు తెలిపారు. వట్లూరులో ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన పథకంలో భాగంగా ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు జరిగే పక్షోత్సవాలల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ నొప్పి దురద లేని మచ్చలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదిస్తే తగు వైద్య సదుపాయం అందించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో వట్లూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.